

వేదాద్రిలో 'హ్యూమన్‌రైట్స్' చైర్మన్


వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామిని ఏపీ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ సీతారామమూర్తి శనివారం రాత్రి దర్శించుకున్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు సరస్వతినగర్‌కు చెందిన వెంకటరెడ్డి కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.

పల్నాడులో ఇద్దరికి కరోనా



అచ్చంపేట: పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం తాడువాయిలో భార్యాభర్తలకు కరోనా వచ్చిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
నరసరావుపేట	6:30	4:32
గుంటూరు	6:28	4:34
బాపట్ల	6:28	4:34

న్యూస్‌రీల్

పది పరీక్షలు ప్రశాంతం



నరసరావుపేటఈస్ట్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పల్నాడుజిల్లా పరిధిలో శనివారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 126 పరీక్షా కేంద్రాలలో 25,219మంది విద్యార్థులకుగాను 24,853మంది హాజరయ్యారు. మరో 366మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా, కాంపోజిట్, ఒకేషనల్ విద్యార్థులకు ఈనెల 17, 18తేదీలలో పరీక్షలు జరగనున్నాయి. ఎటువంటి సమస్యలు లేకుండా పదో తరగతి ప్రధాన పరీక్షలు ప్రశాంతంగా ముగియటం పట్ల జిల్లాలోని విద్యాశాఖాధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకేషనల్, కాంపోజిట్ విద్యార్థులకు జరగనున్న పరీక్షలను సైతం ప్రశాంతంగా ముగించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు.

వక్ఫ్ భూముల కౌలువేలం మరోసారి వాయిదా

నాదెండ్ల: గొరిజవోలు రెవెన్యూ పరిధిలోని షాహీ మసీదు వక్ఫ్ భూముల బహిరంగ కౌలు వేలం మరోసారి వాయిదా పడినట్లు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లా బాషా తెలిపారు. గొరిజవోలు గ్రామంలో సర్వే నెం.424, 425, 430లో మొత్తం 32 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. దీనికై శనివారం గ్రామ సచివాలయంలో బహిరంగ వేలం నిర్వహించగా, నలుగురు రైతులు మాత్రమే హాజరయ్యారు. అయితే అధికారులు రూ.10వేలు కౌలుగా తేల్చటంతో వేలంలో రైతులు పాల్గొనలేదు. గతంలో మార్చి నెలలో ఓసారి కౌలు వేలం నిర్వహించగా, అధికారులు ఎకరాకు రూ.10 వేలు కౌలును నిర్ణయించగా, దీనిపై రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో అప్పుడు కౌలు వేలం వాయిదా పడింది. అయితే అమీనాబాద్‌కు చెందిన ఓ రైతు తనకు 20 ఏళ్ల పాటు కౌలుకు అనుమతించినట్లయితే తాను మామిడి తోట సాగు చేసుకుంటానని తెలపటంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తమ నిర్ణయం చెబుతామని అధికారులు తెలిపారు.

'పది' ఇన్విజిలేటర్ సస్పెన్షన్

రేపల్లె రూరల్: మండలంలోని వడ్డీవారిపాలెంలో జెడ్పీహైస్కూలులో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షల తీరును శనివారం ఆర్జేడీ పార్వతి పరిశీలించారు. కేంద్రంలో స్లిప్‌లు కనిపించటంతో మాస్‌కాపీయింగ్ జరుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మునియ్య, డిపార్ట్‌మెంటల్ అధికారి నరేంద్ర, ఇన్విజిలేటర్ వినోద్‌కుమార్‌లను ఆదేశించారు. ఇన్విజిలేటర్ వినోద్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ రామారావు తెలిపారు.

డీఎస్‌ఓగా పద్మశ్రీ



గుంటూరువెస్ట్: జిల్లా పౌర సరఫరాల శాఖాధికారిగా జి.మోహన్‌బాబును నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు మోహన్‌బాబు పల్నాడు జిల్లాలో పనిచేశారు. గుంటూరులో డీఎస్‌ఓగా పనిచేస్తున్న ఎస్.పద్మశ్రీని పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు.

బాలల ఆరోగ్యంపై చిత్తశుద్ధి

అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్య నిలయాలుగా మారాయి. ఆహ్లాదకర వాతావరణంలో, ఆటపాటలతో కూడిన విద్యనందిస్తూ.. పౌష్టికాలతో కూడిన భోజనం ఇస్తూ.. చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రభుత్వం శుద్ధజలం అందించే ఏర్పాట్లు సైతం చేపట్టింది. దీంతో చిన్నారులకే కాకుండా అక్కడ భోజనం చేసే గర్భిణులు, బాలింతలకు సైతం మేలు జరగనుంది.

అంగన్‌వాడీల్లో నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు

- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సురక్షిత తాగునీరు
- పల్నాడు జిల్లాలో తొలి విడతలో 176 అంగన్‌వాడీల్లో ఏర్పాటు
- ఒక్కో కేంద్రంలో రూ.24 వేలతో ప్లాంట్ ఏర్పాటు



అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మినీ ఆర్వో ప్లాంట్

సత్తెనపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు శుద్ధజలం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు ప్రత్యేకంగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. వర్షాకాలంలో కలుషిత నీరు చేరకుండా, వేసవిలో తాగు నీటి ఇబ్బందులు రాకుండా వీటిని సిద్ధం చేశారు. పల్నాడు జిల్లావ్యాప్తంగా 9 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,010 అంగన్‌వాడీ కేంద్రాలు, 21 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 536 కేంద్రాలు సొంత భవనాల్లో నిర్వహిస్తుండగా, మిగిలిన 1,495 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో చాలాచోట్ల ఉచిత భవనాల్లో కేంద్రాలు ఉన్నాయి. కొన్నిచోట్ల సామాజిక భవనాలు, ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన వాటిలో కొనసాగుతున్నాయి. పలు గ్రామాల్లో స్థలాభావం, ఇతరత్రా సమస్యలతో భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. మొదటి విడతగా పల్నాడు జిల్లా పరిధిలో సొంత భవనాలు ఉన్న 176 చోట్ల మినీ తాగు నీటి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు మంజూరు చేశారు. శుద్ధ జలం సరఫరా కావడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణుల దాహార్తి తీరుతుంది. ఇప్పటికే పిడుగురాళ్లలో 12, మాచర్లలో 17, రాజుపాలెంలో 14 కు గాను 12 ఏర్పాటు చేస్తున్నారు.

పల్నాడు జిల్లా సమాచారం	
మండలాలు	: 28
మున్సిపాల్టీలు	: 06
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	: 09
అంగన్‌వాడీ కేంద్రాలు	: 2,010
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	: 21
సొంత భవనాలు ఉన్న కేంద్రాలు	: 536
అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలు	: 1,495
మొదటి విడత పల్నాడు జిల్లాకు మంజూరైన ఆర్వో ప్లాంట్లు	: 176

సొంత భవనాలు ఉన్నచోట...

అంగన్‌వాడీ కేంద్రాల్లో గతంలో తాగునీటి ఇబ్బందులు ఉండేవి. కుళాయిలు, బోరు బావుల నుంచి పంచాయతీలు సరఫరా చేసే నీటిని తెచ్చుకునేవారు. వర్షాకాలంలో కలుషిత నీటితో ఇబ్బందులు పడేవారు. వేసవి వచ్చిందంటే చాలు నీటి కోసం ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం సాక్ష్యం పథకం కింద ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసింది. మొదటి విడతగా సొంతభవనాలు ఉన్నచోట అందించారు. దశలవారీగా మిగతా కేంద్రాల్లో ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఒక్కో దానికి రూ.24 వేలు ఖర్చు చేస్తున్నారు. 15 లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ గంటకు 12 లీటర్ల నీటిని శుద్ధి చేస్తుంది. నీటి సదుపాయం ఉంటే పైపుల ద్వారా ప్లాంట్లకు వాటర్ నింపి శుద్ధి చేస్తారు. నీటి సదుపాయం లేని చోట నీరు తీసుకువచ్చి ఆర్వో ప్లాంట్ లో పోసి శుద్ధి చేసిన తర్వాత ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

దశలవారీగా అన్ని కేంద్రాల్లో ఏర్పాటు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో సురక్షిత మంచినీటి కోసం ప్రభుత్వం మినీ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తుంది. దీనిలో భాగంగా పల్నాడు జిల్లాకు సంబంధించి మొదటి విడత 176 అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లను అమర్చాం. దశలవారీగా మిగిలిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం.

– అరుణ, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారిణి, పల్నాడు జిల్లా



డాక్టర్ అంబేడ్కర్‌కు సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న మాజీ మంత్రి డొక్కా, కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్

ప్రపంచ మేధావి భారతరత్న అంబేడ్కర్

- కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంత్యుత్సవంలో మాజీ మంత్రి డొక్కా
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాదు

నరసరావుపేట: ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను వాడవాడల్లో పండుగ వాతావరణంలా జరుపుకోవడం అందరి అదృష్టమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంబేడ్కర్ జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ విభాగం ఘనంగా నిర్వహించింది. వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ హాజరయ్యారు. తొలుత కలెక్టరేట్ ఆవరణలో అంబేడ్కర్ ఫొటో గ్యాలరీ, పలు ప్రసంగాలు, ప్రచురణలు, జీవిత చరిత్ర, స్వాతంత్ర్యం ముందు, తర్వాత వంటి అంశాలకు సంబంధించి ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్‌తో కలిసి పలువురు అతిథులు ప్రారంభించి తిలకించారు. అక్కడ ఏర్పాటు చేసిన గంటను అతిథులు మోగించి సమసమాజ స్థాపనకు చేస్తున్న కృషికి మద్దతు తెలిపారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకొని, నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రాంభించారు. మాజీ మంత్రి డొక్కా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి దేశ ప్రగతిని చాటారని అభినందనలు తెలిపారు. మిగతా పండుగల తరహాలో అందరూ సంతోషాలతో అంబేడ్కర్ జయంతిని జరుపుకొంటున్నారన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ జననం, జీవన విధానం గురించి తెలుసుకొని, అందుకు అనుగుణంగా సమాజాభివృద్ధికి పాటుపడేందుకు కృషి చేయాలని సూచించారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నిర్బంధ ప్రాథమిక విద్య, ఓటు హక్కు, మహిళా రిజర్వేషన్, శ్రామిక హక్కులు వంటివి ప్రాథమిక హక్కులు ప్రజలకు వచ్చేలా అంబేడ్కర్ పనిచేశారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం పలువురికి భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, డప్పు సందడులు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ శాఖ అధికారి కె.వి నాయకం, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాగర్ కుడికాలువకు నీటి విడుదల



నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువ ద్వారా శనివారం రాత్రి 7గంటలకు సాగునీటి అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేశారు. సాగర్ ప్రాజెక్టు డీఈ మురళీధర్ మాట్లాడుతూ ప్రాజెక్టు 9వ గేటు ద్వారా 1,000 క్యూసెక్కులు నీటిని విడుదల చేశామని గంటకు 1,000 క్యూసెక్కులు చొప్పున పెంచుతూ రాత్రి 10గంటలకు 4,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆంధ్రా సీఈ శ్రీనివాస రెడ్డి సాగునీటికి 6 టీఎంసీల నీరు విడుదల చేయాలని కృష్ణానది యాజమాన్య బోర్డును కోరటంతో బోర్డు అంగీకారం తెలిపినట్లు చెప్పారు. ఆదివారం ఉదయానికి 9వేల క్యూసెక్కులు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సాగర్‌ప్రాజెక్టు ఏఈఈ బాబుమియా, తెలంగాణ డీఈ పరమేష్, ఆపరేటర్ సృజన్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపుగా వాడుకోవాలి: ప్రభుత్వ విప్ పీఆర్కే



సాక్షి, నరసరావుపేట: నాగార్జున సాగర్ కుడికాలువకు శనివారం రాత్రి సాగునీటిని విడుదల చేసినట్లు ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) ఓ ప్రకటనలో తెలిపారు. ఆయకట్టు కింద సాగుచేసిన వరి, మిర్చి, మొక్కజొన్న పంటలకు చివరి తడికి రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జలవనరులశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. శనివారం రాత్రి నుంచి నీటి విడుదల ప్రారంభమైందని, ఈ నెల 22 వరకు కాలువకు ప్రవాహం ఉంటుందని తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ రైతుల పంటలు కాపాడటం కోసం సుమారు 6 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రతినీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు పీఆర్కే విజ్ఞప్తి చేశారు. రైతులందరూ చివరి తడి పూర్తి చేసుకొని మంచి దిగుబడులతో పంట ఇంటికి చేరాలని కోరుకుంటున్నానని తెలిపారు. రైతుల మేలు కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని, ప్రతిపక్షాలు కేవలం రాజకీయం కోణంలోనే నిరసనలు తెలుపుతున్నారని వ్యాఖ్యానించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 526.30 అడుగుల వద్ద ఉంది. ఇది 161.0148 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 5,018, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకి 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 7,118 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 7,118 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.70 అడుగుల వద్ద ఉంది. ఇది 31.3963 టీఎంసీలకు సమానం.

ప్రజలందరి నమ్మకం జగనన్నే

- విజయవంతంగా 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి



పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి అంబటి, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల విశ్వాసంతో ఉన్నారనే విషయం వెల్లడవుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈనెల ఏడవ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్ పేరుతో మెగా పీపుల్స్ సర్వేను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ సైనికులు వెళ్లి గత నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం ద్వారా తమకు జరిగిన మేలును గురించి అడిగి తెలుసుకుంటున్నారన్నారు. వారి ద్వారా 82960 82960 నంబరుకు మిస్‌డ్ కాల్ ఇప్పిస్తున్నారన్నారు. ఇది దేశ రాజకీయ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ నిర్వహించని అతిపెద్ద సర్వే అన్నారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహించేందుకు ఏపార్టీకైనా ఆత్మవిశ్వాసం, చిత్తశుద్ధి ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేసి వారికి అనుకూలమైన ప్రభుత్వాన్ని నడిపామనే అచంచల విశ్వాసంతో ఏడు లక్షలమంది జగనన్న సైనికులు ప్రతి ఇంటికి వెళ్లి వారిని పలుకరించి వారి ఆశీస్సులు ప్రభుత్వానికి తెలియచేస్తున్నారన్నారు. దీనిపైన ప్రతిపక్షాలు విమర్శలు చేసినా.. పేదవాడికోసం రూ.2లక్షల కోట్లు డీబీటీ విధానం ద్వారా వారి ఖాతాలకు వేసి పనిచేసిన ప్రభుత్వం తమదన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజల ఇళ్లకు వెళ్లి, వారి మద్దతు పొందుతున్నామన్నారు. తమ లక్ష్యం 1.60కోట్ల కుటుంబాలు కాగా, ఇప్పటివరకు 61లక్షల కుటుంబాలకు చేరువయ్యామన్నారు. వారి నుంచి 47లక్షల మిస్‌డ్ కాల్ చేయటం ద్వారా తమకు మద్దతు తెలియచేశారన్నారు. మరో ఆరు రోజుల్లో కార్యక్రమం పూర్తిగాకానే రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గాల వారీగా వివరాలు తెలియజేస్తామన్నారు. చాలా పారదర్శకతతో పీపుల్స్ సర్వేను బహిరంగంగా నిర్వహిస్తున్నామన్నారు. మూడు పేజీల మ్యానిఫెస్టోలోని హామీల్లో 98శాతం అమలుచేశామని, టీడీపీ వారిని తమ మ్యానిఫెస్టో ఏదో చూపించాలని కోరారు. ఏది చెప్పామో అది చేస్తున్నామని, చెప్పనివి ప్రజలకు మేలు జరుగుతాయంటే అవికూడా చేసి చూపిస్తున్నామన్నారు. వచ్చే ఏడాదికాలం పాటు తమ సైన్యం క్షేత్రస్థాయిలోనే ఉంటుందన్నారు. టీడీపీ, జనసేన వారి ఇళ్లకు వెళ్లి మా హయాంలో ఇవి అందాయని గుర్తుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంపై విషప్రచారం చేస్తున్నారని, దీనిని ఎవరూ నమ్మొద్దని కోరారు.

ప్రజల నాడి తెలుసుకుంటున్నాం : ఎమ్మెల్యే గోపిరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఈనెల ఏడవ తేదీ నుంచి నిర్వహిస్తున్న మెగా పీపుల్స్ సర్వే ఒక అద్భుతమైన కార్యక్రమం అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం అనుసరించిన విధానాలపై ప్రజల నాడి తెలుసుకుంటున్నామన్నారు. లబ్ధి చేకూరితేనే తమకు మద్దతు ఇవ్వమని చెప్పిన ఏకైక సీఎం జగన్ అని అన్నారు. చేసిన పనిపై ప్రజల్లోకి వెళుతున్నాడంటే ఆ ధైర్యం చాలా గొప్పదన్నారు. గతంలో సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు చేసిన పని చెప్పుకుంటూ ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేదన్నారు. ప్రజలకు సీఎం జగన్, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేరువైందన్నారు. ప్రజలు పెద్దఎత్తున తమ మద్దతు తెలియచేస్తున్నారన్నారు. సమావేశంలో వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

20న విస్తరణ సలహా మండలి సమావేశం

గుంటూరురూరల్: కృష్ణా మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాన్ని ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.సుబ్బారావు శనివారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. నగర శివారుల్లోని లాంఫాంనందున్న సమావేశ మందిరంలో కృష్ణా మండలంలోని వివిధ జిల్లాల రైతుల సమస్యలు, వాటి పరిష్కారాలు, రానున్న సంవత్సరంలో పరిశోధన, విస్తరణ కార్యక్రమాల దిశానిర్దేశంపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, జిల్లా అధికారులు, ఆదర్శరైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొంటారన్నారు. ఆసక్తి గల రైతులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

విజ్ఞాన్‌లో ఏఎఫ్ఎస్‌టీఐ గుంటూరు చాప్టర్ ప్రారంభం



మాట్లాడుతున్న సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ జ్యోతిర్మయి తదితరులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏఎఫ్ఎస్‌టీఐ(అసోసియేషన్ ఆఫ్ ఫుడ్ సైంటిస్ట్స్ అండ్ టెక్నాలజిస్ట్స్ ఇండియా) గుంటూరు చాప్టర్‌ను శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. విజ్ఞాన్ యూనివర్సిటీలో గ్రీన్ కోటింగ్ 'ఇన్వెస్టింగ్ ఇన్ ద ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్ సిస్టమ్' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ జరిగింది. ఏఎఫ్ఎస్‌టీఐ వైస్ ప్రెసిడెంట్, హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్– సీఎఫ్‌టీఆర్ఐ ఆర్‌సీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ టీ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఏఎఫ్ఎస్‌టీఐ అనేది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రొఫెషనల్, ఎడ్యుకేషనల్ ఆర్గనైజేషన్ అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 46 చాప్టర్లు, 4500 మంది సభ్యులు ఉన్నారని, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నేడు రెండో ఏఎఫ్ఎస్‌టీఐ చాప్టర్‌ను ప్రారంభించామన్నారు. మానవాళికి నాణ్యమైన ఆహారాన్ని అందించటమే ఏఎఫ్ఎస్‌టీఐ ముఖ్య ఉద్దేశమన్నారు. ఏఎఫ్ఎస్‌టీఐ మాజీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పీ రామకృష్ణ, మహారాష్ట్రలోని విట్టల్‌గంగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కో.లిమిటెడ్ ఫౌండర్ ధనరాజ్ షిండే పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయ ఆలయ తిరునాళ్ల

వినుకొండ (నూజెండ్ల): మండల పరిధిలోని జడ్డవారిపాలెం గ్రామంలోని శ్రీ వీరాంజనేయస్వామి వారి తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ఘనంగా సత్కరించారు. ఆయన వెంట నూజెండ్ల మండల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడివరంలో గంగమ్మతల్లి తిరునాళ్ల

వినుకొండ మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో శ్రీ గంగమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామి రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు చెన్నయ్య పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

పాహిమాం.. ప్రసన్నాంజనేయ

శావల్యాపురం: పోట్లూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకారసేవ ,ఆకు పూజలు ఘనంగా చేసినట్లు ఆలయ పూజారీ మారుతీశర్మ తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, సర్పంచి పోపూరి జ్యోతి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని తదితరులు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

20 కిలోలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బందారు సురేష్‌బాబు

పెదకాకాని: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 20 కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బందారు సురేష్‌బాబు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ విశాఖపట్నం గాజువాక నుంచి అనంతపురం పుట్టపర్తికి ఆర్టీసీ బస్సులో గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ముందస్తు సమాచారం మేరకు విజయవాడ బస్టాండ్ నుంచి పుట్టపర్తి బయలు దేరిన బస్సును పెదకాకాని వై జంక్షన్‌లో తనిఖీ చేసినట్లు చెప్పారు. తనిఖీలో రెండు కిలోల బరువు కలిగిన 10 ప్యాకెట్లు గంజాయి లభ్యమైందని వివరించారు. గంజాయి తరలిస్తున్న పాపాని రవిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడు తెలంగాణ నల్గొండ జిల్లా, నకిరేకల్లు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. గాజువాకకు చెందిన కోటి అనే వ్యక్తితో 20 కిలోల గంజాయిని పుట్టపర్తి తీసుకు వెళితే 15 వేల రూపాయలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. ఈ కేసులో గంజాయి తరలిస్తున్న పాపాని రవితో పాటు గంజాయి సరఫరా చేస్తున్న కోటి అనే వ్యక్తిపైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న పాపాని రవిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐలు పాదర్తి కోటేశ్వరరావు, గీతాంజలి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను సత్వరమే పూర్తి చేయండి

అధికారులను ఆదేశించిన జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



కలెక్టరేట్ నుంచి సమీక్ష చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, హాజరైన అధికారులు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సత్వరం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంతో కలిసి జిల్లాకు చెందిన ముగ్గురు రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ ఆధారిత భూముల పంపిణీ కోసం గుర్తింపు, లంక భూముల పరిశీలన, ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన శ్మశానవాటికల కోసం ప్రభుత్వ భూముల గుర్తింపు, పంపిణీ, ఓ.టి.ఎస్, ఓ.టి.సి, ఎఫ్.పి.ఓ.ఎల్.ఆర్, భూముల రీ సర్వే, ఎఫ్‌లైన్ ఫిర్యాదుల పరిష్కారం, ఇ–ఆఫీస్ పర్యవేక్షణ, స్పందనలో వచ్చే సమస్యల పరిష్కారం, ఏ.పి.మీసేవ సర్వీసుల ద్వారా వచ్చే సమస్యల పరిష్కారం, మ్యుటేషన్ సమస్యల పరిష్కారం, క్రయ, విక్రయాలు, సాదా బైనామా, ప్రభుత్వ అవసరాల కోసం భూసేకరణ, సివిల్ సప్లయ్ పంపిణీలో వచ్చే సమస్యల పరిష్కారం, ఎన్నికలకు సంబంధించి ఓటరు కార్డులకు ఆధార్ కార్డుల అనుసంధానం, నకిలీ ఓటరు కార్డుల తొలిగింపు, మార్పులు, చేర్పులు, ఓటరు కార్డుల బదిలీలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. నిర్దేశిత గడువులోపు ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దారులు పాల్గొన్నారు.

30లోగా దరఖాస్తు చేయండి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి

నరసరావుపేట: జిల్లాలోని 11 గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఉన్న ఖాళీలకు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి జి.వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 సంవత్సరానికి మూడవ తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీలు ఉన్నాయన్నారు. మూడో తరగతిలో 32, నాల్గోతరగతిలో 15, ఐదో తరగతిలో 224, ఆరో తరగతిలో 187, ఏడు, ఎనిమిదో తరగతుల్లో 56 చొప్పున, తొమ్మిదో తరగతిలో 74 సీట్లు ఉన్నాయన్నారు. నాగార్జునసాగర్, మినీ గురుకులం గుడిపాటి చెరువునందు చెంచులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. రిజర్వేషన్ ప్రకారం ఎస్టీలకు 78శాతం, ఎస్సీలకు 12శాతం, బీసీలకు ఐదు, ఓసీలకు రెండు, పీహెచ్‌సీలకు మూడుశాతం సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తిచేసిన దరఖాస్తు, కావాల్సిన నకళ్లను చేరాల్సిన గురుకుల పాఠశాలలో 30వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా అందజేయాలని కోరారు. దరఖాస్తులు అధిక సంఖ్యలో వస్తే పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. ఆంగ్లమీడియంలో విద్య బోధించబడుతుందన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'కు విశేష స్పందన



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు రోశయ్య, గిరిధర్, ఎమ్మెల్సీ ఏసురత్నం, రవీంద్రారెడ్డి, నూరిఫాతిమా

పట్నంబజారు: 'జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని పలువురు ఎమ్మెల్యేలు, వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ రీజనల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గుంటూరు పశ్చిమ, పొన్నూరు ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, జేసీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నూరిఫాతిమా మాట్లాడారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో గృహసారథులు నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్ ద్వారా ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు 61 లక్షల మంది వద్దకు వెళ్లినట్లు చెప్పారు. 47 లక్షల మంది మిస్డ్ కాల్స్ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో చెప్పిన విధంగా 98 శాతం హామీలు అమలు చేశామని, ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి ప్రజలను నేరుగా మంచి చేస్తేనే ఓటు వేయమని అడుగుతున్నారన్నారు. నారా చంద్రబాబు నాయుడు లాగా అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను విస్మరించే నైజం సీఎం జగన్‌ది కాదన్నారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా స్పష్టంగా పీపుల్స్ సర్వే నిర్వహించి, వారి అభిప్రాయాలు సేకరించడం జరుగుతోందని చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ ద్వారా ప్రజా మద్దతుతోనే రానున్న ఎన్నికలకు వెళుతున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఈనెల 7న ప్రారంభమైన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఒక ఉప్పెనలా ప్రారంభమైందన్నారు. 31 లక్షల మందికి స్థలాలు ఇచ్చి నివాసాలు కట్టిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. జేసీఎస్ రాష్ట్ర రీజనల్ కో ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన మిత్రుల నుంచి కూడా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్రంలో ఫ్యాను గాలి వీస్తోందని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు.